కంటి పరీక్షలకు చంద్ర గ్రహణం

- ఆస్పత్రుల్లో సీఎం ఈ ఐ కేంద్రాల సేవలు నిలిపివేత
- పరీక్షలతోపాటు ఉచిత కళ్లజోడు పంపిణీకి బ్రేక్
- అవస్థలు పడుతున్న కంటి బాధితులు
- ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి నష్టపోతున్న వైనం

రాయదుర్గంటౌన్: పేదల ఆరోగ్యంపై కూటమి సర్కారు నిర్లక్ష్యం చేస్తోంది. సీహెచ్‌సీ, ఏరియా ప్రభుత్వాస్పత్రుల్లో కంటి సమస్యలతో బాధపడే వేలాది మందికి వెలుగు నింపే నేత్ర పరీక్షల కేంద్రాల (ముఖ్యమంత్రి ఈ ఐ సెంటర్) సేవలను ప్రభుత్వం నిలిపివేసింది. అత్యాధునిక యంత్రాలతో నేత్ర పరీక్షలు చేసి, కళ్లజోళ్లు అందించాలి.కానీ ఈ నెల 14 నుంచి అన్ని ప్రభుత్వాస్పత్రుల్లోనూ కంటి పరీక్ష కేంద్రాలు పూర్తిగా మూతపడ్డాయి. ఆకస్మాత్తుగా కంటి పరీక్ష కేంద్రాలు, ఉచిత కళ్లద్దాల పంపిణీ నిలిచిపోవడంతో నేత్ర సమస్యలున్న వారు రోజూ ఆస్పత్రుల చుట్టూ తిరిగి ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోలేక ప్రైవేటు వైద్యులను ఆశ్రయించి పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన మూడు నెలల్లోనే ఆ పథకానికి మంగళం పాడేయడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

ఈ ఐ కేంద్రాలకు జీవం పోసిన వైఎస్ జగన్ :
వాస్తవానికి ముఖ్యమంత్రి ఈఐ కేంద్రాల ప్రాజెక్ట్‌ను 2017లో టీడీపీ హయాంలోనే ప్రారంభించారు. కానీ నామమాత్రంగా నడిపిస్తూ అమలులో చేతులెత్తేయగా, 2019లో అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం ఈ ఐ కేంద్రాలకు సాంకేతికతను జోడించి అత్యాధునిక యంత్రాలతో పేదలకు మరింత ఉపయోగపడేలా జీవం పోసి నడిపించారు. ఆస్పత్రులకు వచ్చే రోగులకే కాక నియోజకవర్గంలోని ప్రతి పాఠశాలలోనూ కంటి శిబిరాల ద్వారా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. గత ఏడాది జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా కంటి శిబిరాలతో వేలాది మందికి పరీక్షలు చేసి, కళ్లద్దాలు పంపిణీ చేశారు.

ఇంటి దారి పట్టిన ఉద్యోగులు:
రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలోని కంటి పరీక్షల కేంద్రంలో రోజూ 30 నుంచి 35 మంది దాకా ఓపీ సేవలు పొందుతుండేవారు. అవసరమైన వారికి కంటి అద్దాలు సరఫరా అయ్యేవి. ఒక్కో ఈ ఐ కేంద్రంలో ప్రైవేటు ఏజెన్సీ ద్వారా కాంట్రాక్ట్ బేసిక్‌లో ఒక ఆప్తాల్మిక్ అసిసెంట్‌తోపాటు డేటా ఎంట్రీ ఆపరేటర్ సేవలందించేవారు. కానీ ప్రభుత్వ నిర్వాకంతో జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఉద్యోగులు ఇంటి దారి పట్టాల్సి వచ్చింది. అంతేకాక ప్రైవేటు కంపెనీతో ఒప్పంద గడువు ముగియడంతో సెంటర్‌లో ఉన్న మిషన్లు, కంప్యూటర్‌లు తీసుకెళ్లారు.


రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రిలో మూతపడిన ముఖ్యమంత్రి ఈ ఐ కేంద్రం


రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రిలో కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాల్మిక్ అసిస్టెంట్ (ఫైల్)

ఇన్‌చార్జ్ డీసీహెచ్ ఏమన్నారంటే..
సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రుల్లో కంటి పరీక్షల సేవలు నిలిపివేతపై ఇన్‌చార్జ్ డీసీహెచ్ డేవిడ్ సుకుమార్‌ను అడగ్గా, రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఆస్పత్రుల్లో ఈఐ కేంద్రాల్లో సేవలతోపాటు ఉచిత కంటి అద్దాల పంపిణీ ప్రక్రియ ఆగింది. ప్రైవేట్ కంపెనీతో ఒప్పంద గడువు ముగిసింది. ఈ విషయంపై క్లారిటీ లేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే ఆ దిశగా ఆస్పత్రుల్లో పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపడతాం.

పేద, మధ్య తరగతి ప్రజలకు ఇబ్బంది



కంటి సమస్యలతో బాధపడే వారికి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో కంటి పరీక్షల కేంద్రం చాలా ఉపయోకరంగా ఉండేది. నేను కంటి పరీక్ష కోసం ఇటీవల ఆస్పత్రికి వెళితే కేంద్రంలో సేవలు నిలిపివేశారని, కంటి డాక్టర్ లేరని చెప్పారు. దీంతో బళ్లారికి వెళ్లి చికిత్స చేయించుకున్నా. ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోలేం. ప్రభుత్వాస్పత్రిలోనే కంటి వైద్య కేంద్రం ఏర్పాటు చేసి పేదలకు సౌకర్యం కల్పించాలి.
– మేస్త్రీ రమేష్, రాయదుర్గం

ఒప్పంద గడువు ముగిసింది



ప్రైవేట్ ఏజెన్సీ వారు రాయదుర్గంలోని సీహెచ్‌సీలో కంటి పరీక్ష కేంద్రం నిర్వహించేవారు. ఈనెల 6న ప్రభుత్వంతో ఉన్న కాంట్రాక్ట్ గడువు ముగియడంతో మేము కూడా బయటకు వచ్చేశాం. ఆ సంస్థ మిషన్లతోపాటు కంప్యూటర్ కూడా తీసుకెళ్లడంతో మూతపడింది. కొత్త ఏజెన్సీ ద్వారా టెండర్లు పిలిచి కంటి పరీక్షలకు అవకాశం కల్పిస్తే మళ్లీ కంటి పరీక్షలు నిర్వహించే అవకాశం ఉంటుంది.
– మోమిన్ ఇబ్రహీం, కంటి వైద్యుడు, రాయదుర్గం

క్లుప్తంగా

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారులు

కళ్యాణదుర్గం: సమాచార హక్కు చట్టం -2005పై రైతులు అవగాహన పెంచుకోవాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు జగదీష్, కృష్ణతేజ తెలిపారు. గురువారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో డివిజన్ స్థాయి రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు దరఖాస్తు రుసుం, చట్టం విధి విధానాలు, సిబ్బంది సమాచారం ఇవ్వడంపై ఉన్న కాల పరిమితి, సమాచారం కోరే దరఖాస్తు దారుడు అప్పిలేట్ అధికారులకు ఎలా దరఖాస్తు చేసుకోవాలి..? అన్న అంశాలపై వివరించారు. కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ మండలాల వ్యవసాయ శాఖ అధికారులు జాఫర్, మహేష్, సరిత, గౌరితో పాటు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ డీఈఈగా మహ్మద్ రఫీ బాధ్యతల స్వీకరణ



ఉరవకొండ: ఉరవకొండ పంచాయతీ రాజ్ డీఈఈగా మహ్మద్‌రఫీ బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం డీఈఈగా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై ఉరవకొండ డీఈఈగా గురువారం బాధ్యతలు చేపట్టారు. నూతన డీఈఈ మాట్లాడుతూ ఉరవకొండ నియోజకవర్గంలో పంచాయతీరాజ్ కింద పెండింగ్ పనులను పూర్తి చేసి, కొత్తగా గ్రామాలకు రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు.

ఎంపీపీగా లీలావతి బాధ్యతల స్వీకరణ


ఎంపీపీని అభినందిస్తున్న ఎంపీడీఓ, నాయకులు

కణేకల్లు: కణేకల్లు ఎంపీపీగా లీలావతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. తన ఛాంబర్‌లో సంప్రయదాయబద్ధంగా పూజలు నిర్వహించిన అనంతరం ఆమె బాధ్యతలు స్వీకరించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రహరీ నిర్మాణ పనులపై ఆమె సంతకం చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ఎంపీటీసీలతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులు, ఈఓఆర్డీ గూడెన్న, సీనియర్ అసిస్టెంట్ హనుమంతప్ప, మండల ప్రజాపరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఎంపీపీకు శుభాకాంక్షలు తెలిపారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మారెంపల్లి మారెన్న, నాగరాజు, రామన్న, ఎంపీటీసీ శరబన్నలు ఎంపీపీ లీలావతిని అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు చాపిరి విద్యార్థి ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన శ్రీహరి

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని చాపిరి గ్రామం ఉన్నత పాఠశాల విద్యార్థి శ్రీహరి రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయినట్లు పీడీ మురళి గురువారం తెలిపారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో బుధవారం నిర్వహించిన అండర్-17 జిల్లా స్థాయి ఫుట్‌బాల్ క్రీడా పోటీల్లో శ్రీహరి ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన శ్రీహరి ఈనెల 28 వెలగొండలో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ క్రీడా పోటీల్లో పాల్గొననున్నాడు. విద్యార్థిని హెచ్ఎం నరసింహులు, ఉపాధ్యాయులు అభినందించారు.

వ్యర్థాలతో కళాకృతులు


వ్యర్థాలతో కళాకృతులు తయారు చేసిన విద్యార్థులు

కుందుర్పి: స్థానిక జూనియర్ కళాశాల, కేజీబీవీ విద్యార్థినులు చెత్తకేంద్రాల నుంచి వ్యర్థాలను సేకరించి, వాటితో వివిధ రకాల కళాకృతులుగా తీర్చిదిద్దారు. గురువారం ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, ఎంఈఓ తిప్పేస్వామి తదితరులు మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారు చేయడానికి గ్రామాల్లో చెత్త కేంద్రాలు ఎంతో దోహదపడుతున్నాయన్నారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలపై వివరించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, ప్రోగ్రాం అధికారి ఉమా మహేశ్వర్, పంచాయతీ కార్యదర్శులు బాషా, రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

రేపు పెన్నహోబిలంలో ప్రత్యేక పూజలు


వై.విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 28న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనృసింహుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు తిరుమల శ్రీవారి లడ్డూ, వెంకన్న విశిష్టతను అపవిత్రం చేశారన్నారు. చంద్రబాబు చేసిన ఈ పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు పెన్నహోబిలం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రాయితీతో విత్తనాలు

కూడేరు: ప్రభుత్వం రాయితీతో రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలను అందిస్తోందని ఏఓ విజయకుమార్ సూచించారు. గురువారం కూడేరులోని రైతు సేవా కేంద్రంలో రాయితీ ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీని వ్యవసాయాధికారులు నిర్వహించారు. ఏఓ విజయకుమార్ మాట్లాడుతూ రాయితీతో కేజీ ఉలవలు రూ.17.40 తో రైతు పొలాన్ని బట్టి 50 కేజీల వరకు, అలాగే కేజీ లైలా రకం జొన్న విత్తనాలు రూ.47తో పొలాన్ని బట్టి 3-15 కేజీల వరకు ఇస్తామన్నారు. సర్పంచ్ లలితమ్మ, ఏఈఓ శైలజ, వీహెచ్ ఏలు సాజియా, రాజకుమార్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఉండి ఎమ్మెల్యే రఘురామను అరెస్టు చేయాలి

కుందుర్పి: బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చించి, అవమానపరిచిన ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజును అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సాకే గురుమూర్తి, తాలూకా అధ్యక్షులు రామన్న, మండల అధ్యక్షుడు హరీష్ తదితరులు తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఉండి ఎమ్మెల్యేను అరెస్టు చేయాలని నిరసన తెలియజేశారు. ఏఎస్ఐ విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు.

క్లీన్ రాయదుర్గం మన లక్ష్యం కావాలి

రాయదుర్గంటౌన్: క్లీన్ రాయదుర్గం మన లక్ష్యం కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని సచివాలయాల పరిధిలో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా గురువారం మొక్కలు నాటే కార్యక్రమంతో పాటు క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టారు. పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందన్నారు. శాంతినగర్ సంతమార్కెట్‌లో చెత్తచెదారాన్ని తొలగించి స్వచ్ఛత పాటించారు. స్వచ్ఛ రాయదుర్గంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గౌని లావణ్య, బండి అజయ్, వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, గౌని శ్రీరామిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప

వట్లకుంటలో డ్రైనేజీ నీరు కలుషితం
రాయదుర్గంటౌన్: పట్టణంలోని 28వ వార్డు కొండ దిగువన గల వట్లకుంటలోకి డ్రైనేజీ నీరు కలుషితమవుతున్న ఫిర్యాదుపై గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డ్రైనేజీ నీరు వచ్చి వట్లకుంటలో చేరుతుండడంతో నీరు కలుషితమై దుర్వాసనతో పాటు ప్రజలు రోగాల బారినపడే అవకాశం ఉందన్నారు. వట్లకుంటలోకి డ్రైనేజీ నీరు వస్తున్న ఏరియాలో డ్రైన్ వద్ద అడ్డుకట్ట వేయాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్, ఏఈ కోదండను సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పొరాళ్ల గోవిందరాజులు, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జ్ పొరాళ్ల శివకుమార్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

కంబదూరు: ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్క విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని రిడ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వరప్ప సూచించారు. గురువారం రిడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మీకు తెలుసా? అనే కార్యక్రమం ద్వారా హెచ్ఐవీ,ఎయిడ్స్‌పై రిడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు హెచ్ఐవీ,ఎయిడ్స్ ఎలా వస్తుంది? ఎలా వ్యాపించదు, ఎయిడ్స్ రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి లక్షణాలు, కండోమ్ ఉపయోగాలపై వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిత్తప్ప, హనుంతరెడ్డి, రిడ్స్ సిబ్బంది యశోదమ్మ, భాగ్యమ్మ, లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో రిడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మీకు తెలుసా? అనే కార్యక్రమం నిర్వహించారు. గురువారం బాలికకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రిడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ మహేష్, ప్రిన్సిపాల్ సౌభాగ్య, విద్యార్థులు పాల్గొన్నారు.


పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

వజ్రకరూరు: స్థానిక కేవీ జెడ్పీ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలల్లో సత్యసాయిసేవాసమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 7,8,9 తరగతుల విద్యార్థులకు భగవంతుడు 'ఒక్కడే – నా నిజమైన స్నేహితుడు'అనే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. శ్రీసత్యసాయిసేవా సమితి భక్తమండలి సభ్యుడు నరసింహారెడ్డి, సర్పంచు మోనాలిసా, వార్డు సభ్యుడు అచ్చనాల మధుసూదన్, హెచ్ఎంలు స్వర్ణలత, ప్రిన్సిపాల్ శ్యామలదేవి, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.


వజ్రకరూరులో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేసిన దృశ్యం

రూ.48 కోట్లతో బ్రిడ్జి పనులు ప్రారంభిస్తాం

కణేకల్లు: కణేకల్లు శివారులో వేదవతి హగిరిపై రూ.48 కోట్లతో నిర్మించ తలపెట్టిన బ్రిడ్జి పనులకు దసరా పండుగ కల్లా భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. గురువారం కణేకల్లులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం జరిగింది. రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత హాజరయ్యారు. తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులు, హెచ్చెల్సీ డీఈఈ మద్దిలేటి, ఏఓ శ్రవణ్ కుమార్, సర్పంచు నిర్మల, మాజీ సర్పంచు షేక్ ఫక్ర్‌ద్దీన్, మాజీ వైస్ సర్పంచు ఆనంద్‌రాజు, నాయకులు వేలూరు మరియప్ప, జి.బసవరాజు పాల్గొన్నారు.

మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాల సందర్శన
గుమ్మఘట్ట: గోనబావిలోని మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలను మంత్రి సవిత, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు గురువారం సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆగిపోయిన పాఠశాల భవన నిర్మాణ పనులకోసం రూ.12.27 కోట్లు, ప్రభుత్వం అదనంగా రూ.10.2 కోట్లు మంజూరు చేసిందన్నారు. అనంతరం గుమ్మఘట్టలో అద్దె భవనంలో ఉన్న మహాత్మాజ్యోతిరావ్ పూలే పాఠశాలను వారు పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, పిల్లలతో కలిసి భోజనం చేసి, నాణ్యతను పరిశీలించారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు చిత్రంలో మంత్రి సవిత

చేనేత కార్మికుల సమస్యలు తీర్చాలి
రాయదుర్గంటౌన్: సమస్యలను పరిష్కరించాలని మంత్రి సవితమ్మకు చేనేతలు గురువారం వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద సీపీఐ పట్టణ కార్యదర్శి కొట్రేష్ ఆధ్వర్యంలో ఏపీ చేనే సంఘం నాయకులు, చేనేతలు ఆమెను కలిసి సమస్యలను వివరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు బంగి శివ, సీపీఎం నాయకులు మల్లికార్జున ఆధ్వర్యంలో రైతులు, ప్రజా, విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు


గాయాలపాలైన మహబూబ్ బాషా

బెళుగుప్ప: మండలంలోని బ్రాహ్మణపల్లి, విరుపాపల్లి గ్రామాల సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. కొత్తపల్లికి చెందిన తిప్పేస్వామి వ్యక్తిగత పనిపై ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, విరుపాపల్లి వద్ద లారీ తగిలి తీవ్ర గాయాలయ్యాయి. బ్రాహ్మణపల్లి వద్ద జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో నేమకల్లుకి చెందిన అన్న, చెల్లెళ్లు అయిన మహబూబ్ బాషా, షకీలకు గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఉపాధ్యాయులకు సన్మానం


ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

విడపనకల్లు: మండల కేంద్రంలో ఎంఆర్‌సీ కార్యాలయంలో డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు అధ్యక్షతన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసులు, కె.భాస్కర్‌ను తోటి ఉపాధ్యాయులు గురువారం సన్మానించారు. మండలంలో ఒకేసారి ఇద్దరికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు రావడం సంతోషకరమని ఎంఈఓ మల్లికార్జున అన్నారు. సన్మాన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేష్, నారాయణస్వామి, ఉపాధ్యాయులు కిశోర్, శ్రీరాములు, బాలముద్దన్న, మహేశ్వరప్ప, రామన్న, ఏపీటీఎఫ్ అధ్యక్షులు నజీర్, రాధ, రాధిక, వాణి, వసంతలక్ష్మి, ధనుంజయ, బీసీ ఓబన్న, భాస్కర్, భూమా రామాంజనేయులు పాల్గొన్నారు.

కుడి కాలువకు నీటిని విడుదల చేయండి

కూడేరు: పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్ డ్యాం) నుంచి ధర్మవరం కుడి కాలువకు నీటిని విడుదల చేయాలని పలు గ్రామాల రైతులు కోరారు. గురువారం మరుట్ల, జల్లిపల్లి, కలగళ్ల, కూడేరుకు చెందిన రైతులు విలేకరులతో మాట్లాడారు. రెండేళ్లుగా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక పోవడంతో భూగర్భ జలాలు అడుగంటి, వ్యవసాయ బోర్లలో నీటి లభ్యత తగ్గి పోయిందన్నారు. కుడి కాలువకు నీటిని విడుదల చేస్తే కాలువ గుండా ప్రవహించే నీటితో వ్యవసాయ బోర్లలో నీళ్లు పెరుగుతాయన్నారు. తద్వారా పంటలు సాగు చేసుకోవడానికి , సాగు చేసిన పంటలు దెబ్బతిన కుండా ఉండడానికి అవకాశముంటుందన్నారు.

చంద్రబాబు పాపాలను ప్రక్షాళన చేద్దాం

- మాజీ ఎంపీ డాక్టర్ తలారి రంగయ్య


మాట్లాడుతున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: రాష్ట్ర వ్యాప్తంగా చంద్రబాబు పాపాలను ప్రక్షాళన చేద్దామని వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ తిరుమల పవిత్రతకు చంద్రబాబు భంగం కలిగించారన్నారు. తిరుమల లడ్డూకు వాడే నెయ్యిలో కల్తీ అయ్యిందని చంద్రబాబు ప్రసాదం పవిత్రతను అప్రతిష్టపాలు చేస్తున్నారన్నారు. బాబు చేసిన పాపాలను ప్రక్షాళన చేసేందుకు అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల్లో పూజలు చేయనున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలన్నారు. ఈనెల 28న ఉదయం 10 గంటలకు స్థానిక సరోజా కాంపౌండ్‌లోని పార్టీ కార్యాలయం వద్ద నుంచి పార్టీ శ్రేణులతో కలిసి బయల్దేరి ఆర్డీటీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఉరవకొండ: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉరవకొండ మేజర్ పంచాయతీ వైఎస్సార్‌సీపీ సర్పంచ్ మీనుగ లలితమ్మ పిలుపునిచ్చారు. గురువారం ఉరవకొండలో సీజనల్ వ్యాధులపై ఇంటింటికీ వెళ్లి కరపత్రాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేశారు. ఇన్‌చార్జ్ ఈఓ రమణతో పాటు మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న సర్పంచ్, ఈఓలు

పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత
శెట్టూరు: ఇళ్ల,ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురామ్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో స్వచ్ఛతే హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద గ్రామ సభను నిర్వహించారు. గ్రామ సభలో పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుమార్, మాజీ జెడ్పీటీసీ గురుప్రసాద్, నాయకులు అబ్దుల్ రజాక్, సచివాలయ సిబ్బంది నాగరాజు, మనోహర్, పురోషోత్తం, భారతి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రం చేయించండి
కుందుర్పి: మండలంలోని బోదపల్లిలో పారిశుధ్యం పనులు చేపట్టి వీధుల్లో నిలిచి ఉన్న మురుగునీరు తొలగించాలని ఎంపీడీఓ లక్ష్మీనరసింహకు గురువారం వినతిపత్రం అందించారు. రోడ్లన్నీ మురుగు నీటితో నిండి ఉండడంతో దోమలు అధికమై గ్రామంలో విషజ్వరాలు వస్తున్నట్లు వారు తెలిపారు.

వేల్పుమడుగులో పొలంబడి

విడపనకల్లు: వేల్పుమడుగులో ఏఓ పెన్నయ్య ఆధ్వర్యంలో పొలంబండి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఏఓ రైతులతో కలసి కంది పంటను పరిశీలించి, పంట సాగులో తీసుకోవాల్సిన మెలకువలపై రైతులకు అవగాహన కల్పించారు. పంట నమోదు వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. హార్టికల్చర్ ఆఫీసర్ నెట్టికంటయ్య, సర్పంచు తిప్పారెడ్డి, వీపీఏ కుళ్లాయి నాయక్, తదితర రైతులు పాల్గొన్నారు.


వేల్పుమడుగులో పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

ఉచితంగా ట్యాలీ శిక్షణ

అనంతపురం: రూడ్‌సెట్ సంస్థలో గ్రామీణ నిరుద్యోగ యువకులకు ఉచితంగా కంప్యూటర్ ట్యాలీ, ఏసీ, ఫ్రిడ్జ్‌ల రిపేరీపై ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు రూడ్‌సెట్ డైరెక్టర్ ఎస్.విజయలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 30 రోజుల ఉచిత శిక్షణతో పాటు ఉచిత భోజనం, ఉచిత వసతి కల్పిస్తామన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన 19 నుంచి 45 సంవత్సరాల్లోపు వయస్సు గల వారు శిక్షణ పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. ఆధార్, రేషన్ కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. పేర్లను నమోదు చేయించుకునేందుకు 9618876060, 8309915577 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

శర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో ఫాతేహాలు


ప్రత్యేక అలంకరణలో స్వామి సమాధి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు శర్మాస్ హుసేన్సీ స్వామి దర్గాలో గురువారం ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. దర్గా పెద్దలు ఉదయం స్వామివారి సమాధికి గంధం పూసి, నూతన వస్త్రాలతో అలంకరించారు.

విరబూసిన బ్రహ్మకమలం


వసంతమ్మ ఇంట్లో విరబూసిన బ్రహ్మకమలం

ఉరవకొండ: మండలంలోని పెద్ద కొకుంట్లకు చెందిన వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు వసంతమ్మ ఇంట్లో అరుదైన బ్రహ్మకమలం విరబూసింది. వైఎస్సార్‌సీపీ నాయకురాలు వసంతమ్మ కుటుంబ సభ్యు లు బ్రహ్మకమలానికి పూజలు నిర్వహించారు.

